విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 5, మే 2024

సజావుగా ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి..

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: అనంతపురం నగరంలోని ఆర్.అండ్.బి అతిథి గృహంలో శుక్రవారం రాత్రి అనంతపురం పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి 2వ సప్లమెంటరీ ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్.వి తో కలిసి గుంతకల్లు, తాడిపత్రి, సింగనమల, అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల సాధారణ పరిశీలకులు మనీష్ సింగ్, అనంతపురం పార్లమెంటు నియోజకవర్గం, జిల్లాలోని రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల సాధారణ పరిశీలకులు సి.అజయ్ నాథ్ ఝ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పారదర్శకంగా అనంతపురం పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి 2వ సప్లమెంటరీ ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేయడం జరిగిందన్నారు. సప్లమెంటరీ బ్యాలెట్ యూనిట్‌లకు సంబంధించి 2,350 బ్యాలెట్ యూనిట్‌ల 2వ సప్లమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. ఎన్నికల కమిషన్ ఈవీఎంలు, వివి ప్యాట్స్‌ల ర్యాండమైజేషన్ కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయడం జరిగిందని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల ప్రతి నిధులు, అభ్యర్థుల సమక్షంలో ఈఎంఎస్ 2.0 సాఫ్ట్ వేర్‌లో ఆన్‌లైన్ ద్వారా అత్యంత పార దర్శకతతో పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి 2వ సప్లమెంటరీ ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియనును చేపట్టా మని తెలిపారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, నోడల్ అధికారి నరసింహారావు, ఎస్‌బిసి డిఐఓ రవిశంకర్, టీడీపీ అభ్యర్థి అంబికా జి.లక్ష్మీనారాయణ, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి నారాయణప్ప, స్టాండింగ్ కమిటీ మెంబర్తైన తెలుగుదేశం పార్టీ ప్రతినిధి పవన్‌కుమార్, ఆప్ ప్రతినిధి మసూద్ వలీ, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి షేక్ ఇమామ్ వలీ, బిజెపి ప్రతినిధి ఈశ్వర ప్రసాద్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి శ్రీనివాసులు, సమాజ్వాది పార్టీ షేక్ నిజాం, స్వతంత్ర అభ్యర్థులు చాదేశ్వరి, కేతిరెడ్డి రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు చేపడుతున్నాం

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల్లో పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల సాధారణ పరిశీలకులు దీపక్ రామచంద్ర తవారే ఆదేశించారు. శనివారం అనంతపురం జేఎన్టీయూ కళాశాల ప్రాంగణంలో గల డిపార్ట్మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ భవనంలో సాధారణ ఎన్నికలు - 2024 కోసం రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాల్ లను, కమీషనింగ్ రూమ్, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ రూమ్‌లను జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్.వి (ఐఏఎస్)తో కలిసి ఎన్నికల సాధారణ పరిశీలకులు దీపక్ రామచంద్ర తవారే పరిశీలించారు.

విధులపై పోలింగ్ అధికారులకు పూర్తి అవగాహన ఉండాలి

జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర-ఉరవకొండ : సాధారణ ఎన్నికల నేపథ్యంలో పీఓలు, ఏపీఓలకు కేటాయించిన విధులపై పూర్తి అవగాహన ఉండాలని, శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్, ఉరవకొండ రిటర్నింగ్ అధికారి కేతన్ గార్గ్ పేర్కొన్నారు. శనివారం ఉరవకొండ పట్టణంలోని కరిబసవ స్వామి ఉన్నత పాఠశాలలో సాధారణ ఎన్నికలపై పీఓలు, ఏపీఓలులకు రెండవ శిక్షణా కార్యక్రమం నిర్వహించగా, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పిఓలు, ఏపీఓల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఎన్నికల కోసం నియమించిన పీఓలు, ఏపీఓలు విధుల గురించి పూర్తిగా తెలుసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వ హణలో శిక్షణా కార్యక్రమాలు అత్యంత ముఖ్యమని, శిక్షణలో అందించే ప్రతి అంశంపై పూర్తి స్పష్టతతో తెలుసుకొని ఉండాలన్నారు. సజా వుగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా కేటాయించిన విధులు నిర్వర్తిం చాలని సూచించారు. అలాగే పోలింగ్ రోజున అందరూ సరైన సమయంలో కేటా యించిన విధులకు హాజరు కావాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం కనబడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని తెలిపారు. పీఓలు, ఏపీఓలు పారదర్శకంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈఆర్వో శిరీష, వ్యవసాయ శాఖ ఏడీ చంద్రానాయక్, ఏఎల్ఎంటిఎస్ పీఓలు, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా వైసీపీ

- మరోసారి ఆదరించండి ...

-ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ...

విశాలాంధ్ర-రాప్తాడు: అన్ని వర్గాలకు అండగా ఉన్న వైసీపీని మరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి కోరారు. రామగిరి మండలం కుంటిమద్ది పంచాయతీ పరిధిలోని ఎస్ హెచ్ కాలనీ, సుద్దుకుంటపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయన చేపట్టిన ఎన్నికల ప్రచారానికి భారీ సంఖ్యలో ప్రజలు అభిమానులు తరలివచ్చారు. జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబం లబ్ది పొందిందని ఈ పథకాలు ఇలాగే కొనసాగాలంటే మళ్ళీ జగనన్న ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే అన్నారు. మాజీ మంత్రి పరిటాల సునీత నియోజకవర్గం చేసింది ఏమీ లేదని విమర్శించారు. చంద్రబాబు నాయుడు అబద్ధపు మేనిఫెస్టోతో మరోసారి ముందుకు వస్తున్నారని టీడీపీని ఛీ కొట్టాలన్నారు హిందూపురం ఎంపీగా బోయ శాంతమ్మను, రాప్తాడు ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ నాయకురాలు శివబాల, మండల కన్వీనర్ హనుమంత రెడ్డి జెడ్పిటిసి నాగార్జున, ఎంపీపీ నాగమ్మ, మీనుగ నాగరాజు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, చైర్మన్లు, డైరెక్టర్లు, గృహసారధులు పాల్గొన్నారు.

ప్రకాశ్‌రెడ్డితోనే నియోజకవర్గ అభివృద్ధి

-ఎమ్మెల్యే సతీమణి తోపుదుర్తి మనోరమ

విశాలాంధ్ర-రాప్తాడు: నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డితోనే సాధ్యమని ఆయన సతీమణి తోపుదుర్తి మనోరమ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి వైసిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని వర్గాలకు సీఎం జగన్ సంక్షేమ పథకాలు మంజూరు చేశారని మరోసారి ఆయన్ను సీఎం గా చేసుకుందామని పిలుపునిచ్చారు. రాప్తాడు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అన్ని వర్గాల మనసులను గెలిచిన ఘనత ఎమ్మెల్యేకు దక్కుతుందన్నారు. సీఎం చంద్రబాబు, మాజీ మంత్రి పరిటాల సునీత దోచుకోవడం దాచుకోవడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి, ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మకు ఫ్యాన్ గుర్తులకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పసుపుల హేమావతి, కన్వీనర్లు జూటూరు శేఖర్, కే.రాధమ్మ, సర్పంచ్ చంద్రకళ చిన్న కృష్ణారెడ్డి, మరూరు ఆది, యూత్ కన్వీనర్ విశ్వనాథ రెడ్డి, నాయకులు బాలకృష్ణారెడ్డి, డీలర్ ప్రసాద్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, తిరుపాల్ రెడ్డి, నారాయణ రెడ్డి, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెప్పాడంటే చేస్తాడంతే...

భారీ జనసందోహం మధ్య వైసీపీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారం

జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపు

ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు..

విశాలాంధ్ర-శింగనమల : నార్పల మండల కేంద్రంలో మన ఊరికి మన వీర కార్యక్రమంలో భాగంగా భారీ సంఖ్యలో వైసీపీ శ్రేణులు, నాయకులు, గడపగడపకు ఎన్నికల ప్రచారాన్ని శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు, అనంతపురం ఎంపీ అభ్యర్థి ఎం.శంకర్ నారాయణ శనివారం నార్పల మండల కేంద్రంలో ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, ఇంటి దగ్గరకు సంక్షేమ పథకాలు కావాలంటే మరోసారి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుందామని కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులును ఎంపీ అభ్యర్థి శంకర్ నారాయణను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

నాయకుడంటే ఇచ్చిన మాటపై నిలబడాలి..

- ఎన్నికల కోసం హామీలు ఇచ్చి ఎన్నిసార్లు మోసం చేస్తారు
- మేము చేస్తామంటేనే చెబుతాం.. అదే చేసి చూపిస్తాం
- గ్రామాలు ప్రశాంతంగా ఉండాలన్నదే మా లక్ష్యం
- ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి పరిటాల సునీత

ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సునీత.. స్వాగతం పలుకుతున్న నాయకులు

విశాలాంధ్ర-రాప్తాడు: నాయకుడంటే మాట మీద నిలబడాలని.. ఎన్నికల కోసం హామీలు ఇవ్వడం.. ఆ తర్వాత అంతా చేసినట్టు ప్రజల్ని మభ్య పెట్టడం సరైంది కానీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డికి మాజీ మంత్రి పరిటాల సునీత చురకలంటించారు. చెన్నేకొత్తపల్లి మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆమెకు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. పులేటిపల్లి, కోటంపల్లి, పైలబోయలపల్లి, నరసింగరాయునిపల్లి, ఓబుళంపల్లి, ప్రసన్నయపేట, ఆమిదాలకుంట, నాగిశెట్టిపల్లి, కనుముక్కల గ్రామాలలో శనివారం ఆమె ప్రచారం నిర్వహించారు. ప్రతి గ్రామంలో ఆమెకు విశేష స్పందన కనిపించింది. కొన్ని గ్రామాల్లో పూల వర్షం కురిస్తూ ముందుకు సాగారు. రోడ్ షోలతో పాటు ఇంటింటా వెళ్తూ కూటమి పథకాలను ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు. ఈసందర్భంగా గ్రామాల్లో టీడీపీ హయాంలో ఏఏ కార్యక్రమాలు చేశామన్నది వివరించారు. అలాగే ఈ ఐదేళ్లలో ఏం అభివృద్ధి జరిగిందో ఒక్కసారి చూసుకోవాలన్నారు. 2019లో టీడీపీ ప్రభుత్వం వచ్చి ఉండి ఉంటే.. చెన్నేకొత్తపల్లి మండలం హంద్రీనీవా నీటితో సస్యశ్యామలం అయి ఉండేదన్నారు. కానీ సానుభూతి మాటలు, దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రకాష్ రెడ్డి లక్ష ఎకరాలకు నీరు ఇచ్చామని పచ్చి అబద్ధాలు చెబుతున్నారన్నారు. నాయకుడంటే ఇచ్చిన మాట నెరవేర్చాలని.. అలా కాకుండే పనులు చేయకున్నా చేసినట్టు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మేము పేరూరు ప్రాజెక్టుకు నీరు తెస్తామని.. నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు నీరందించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చామని... పనులు కూడా ప్రారంభించామన్నారు. కానీ అధికారం పోవడం వలన ఆ పనులు ఎక్కడివక్కడే ఆగిపోయాని అన్నారు. ఈసారి వచ్చేది తెలుగుదేశం పార్టీనేనని.. పేరూరు ప్రాజెక్టుకు నీరిస్తామని చెప్పారు. పరిటాల కుటుంబం మాట ఇచ్చిందంటే.. దానికి కట్టుబడి ఉంటుందన్నారు. గ్రామాల్లో ప్రశాంతత ఉండాల న్నదే మా ఉద్దేశ్యం అని.. అందుకే ప్రకాష్ రెడ్డి సోదరులు దాడులు చేస్తున్నా.. కొన్ని సార్లు భరించామన్నారు. అదే తాను మంత్రిగా ఉన్నప్పుడు దాడులు చేయాలనుకుంటే.. మీరు బయటకు వచ్చేవారా అని నిలదీశారు. ఇప్పటివరకు సహించామని.. కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదన్నారు. ప్రజలంతా ఆలోచించుకుని ఎవరు న్యాయం చేస్తారో వారికే ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు...

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

- శింగనమల ఎస్ఐ చంద్రశేఖర్

విశాలాంధ్ర-శింగనమల: శింగనమల మండల కేంద్రంలో ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన, అల్లర్లు గొడవలు సృష్టించిన కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ చంద్రశేఖర్ హెచ్చరించారు, శనివారం మండల కేంద్రంలోను బండమీద పల్లి గ్రామంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించడంతో పాటు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతి ఒక్కరూ అందుకు అనుగుణం గా నడుచుకోవాలన్నారు. మద్యం గుట్కా గొడవలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దన్నారు. శింగనమల మండల ప్రజలకు అందుబాటులో ఉండి తమ సేవలను అందిస్తామని తెలిపారు,ఈ కార్యక్రమంలో బెటాలియన్ ఫోర్స్ శింగనమల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

- నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్

విశాలాంధ్ర అనంతపురం వైద్యం .. సాధారణ ఎన్నికలు- 2024 కోసం ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాలలో అన్ని కనీస సౌకర్యాలు కల్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్.వి (ఐఏఎస్) వారి ఆదేశాల అనుసరిస్తూ తాడిపత్రి నియోజకవర్గంలోని తాడిపత్రి మండలం చిన్నపొలమాడు గ్రామంలోని 154 ,155 పోలింగ్ కేంద్రాలను మరియు పెద్దపొలమాడు గ్రామాల్లో గల 144, 145 పోలింగ్ కేంద్రాలను, పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని అనంతపురం నగరపాలక సంస్థ కమిషనర్ వై.మేఘ స్వరూప్ పర్యవేక్షించి పరిశీలించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కమిషనర్ మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లో కావలసిన ఏర్పాట్లను ఆరాతీశారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తాడపత్రి తహసీల్దార్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించండి

అనంతపురం రూరల్ డీఎస్పీ బి.వి.శివారెడ్డి..

విశాలాంధ్ర అనంతపురం వైద్యం .. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని అనంతపురం రూరల్ డీఎస్పీ బి.వి.శివారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు సమస్యాత్మక గ్రామమైన శింగనమల మండలం సి.బండమిదపల్లిలో ఆయన పర్యటించారు. గ్రామస్తులతో సమావేశమై ఎన్నికలపై చైతన్యం చేశారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా సంకల్పించామన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తాం ఓటు హక్కును నిర్భయంగా వినియోగిం చుకోవాలని కోరారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలకు వెళ్లరాదని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ఏవేని సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించు కోవాలని సూచించారు. అనంతరం... ఈ గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. బందోబస్తు పక్కాగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. డీఎస్పీ వెంట శింగనమల ఎస్సై చంద్రశేఖర్, సబ్ డివిజనల్ స్పెషల్ పార్టీ పోలీసులు ఉన్నారు.

ఈ నెల 6 నుండి జీ తెలుగులో జానకి రామయ్యగారి మనవరాలు

విశాలాంధ్ర-అనంతపురం: ఆప్యాయత అనురాగాల మధ్య సాగే అందమైన ప్రేమ కథతో రూపొందుతున్న సీరియల్ జానకి రామయ్య గారి మనవరాలు ఈనెల 6 నుంచి జీ తెలుగులో ప్రసారం కానున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.జానకి రామయ్యగారి మనవరాలు సీరియల్ కథ తరతరాల నుంచి వస్తున్న మిఠాయి వ్యాపారం చేస్తున్న ఉత్తమ్ (రాజీవ్) చుట్టూ తిరుగుతుందన్నారు. కుటుంబం, ప్రేమ మధ్య సాగే ఆసక్తికర కథాంశంతో సాగే జానకి రామయ్యగారి మనవరాలు జీ తెలుగు వీక్షకులను అలరించేందుకు సిద్ధమైందన్నారు. ఈ సీరియల్లో రాజీవ్, సంగీత ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, ఫాతిమా బాబు, రాజశేఖర్, అర్చన, జాకీ, కల్యాణ్ ప్రసాద్ ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారన్నారు. ప్రతిభావంతులైన నటీనటులు, అద్భుతమైన కథాంశం, ఆసక్తికరమైన మలుపులతో సాగే జానకి రామయ్యగారి మనవరాలు సీరియల్ మీరూ తప్పక చూడాలన్నారు. ఈ సీరియల్ సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 2:30 గంటలకు, మీ జీ తెలుగులో ప్రసారమవుతుందని వివరించారు.

కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేయాలి

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే పైప్‌లైన్ పనులను నిలిపివేసి తాగునీటి ఇబ్బందుకు గురిచేసిన కాంట్రాక్టర్ బొమ్మినేని రామాంజనేయ చౌదరిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఉరవకొండ ఎంపీపీ నరసింహులు, జడ్పిటిసి సభ్యులు పార్వతమ్మ, గ్రామ సర్పంచ్ లలిత, మాజీ ఎంపీపీ చందా చంద్రమ్మ, వైసిపి నాయకులు బసవరాజు శనివారం ఉరవకొండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లా డుతూ ఉరవకొండ పట్టణ ప్రజలకు శాశ్వతంగా తాగునీటి సమస్య ను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి తాగు నీటి అవసరాల కోసం 34 కోట్ల రూపాయలను మంజూరు చేయించారని, అందులో భాగంగా పిఏ బిఆర్ డ్యామ్ నుంచి నీళ్లను ఉరవకొండకు అందించేందుకు ఉదిరిపికొండ గ్రామం నుంచి ఉరవకొండ పట్టణానికి నూతన పైప్‌లైన్ నిర్మాణానికి రూ.12 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసి టెండర్లు పిలిచిందని, గత సంవత్సరం డిసెంబర్ 4వ తేదీన పనులు చేసేందుకు సంబంధిత కాంట్రాక్టర్ డిపార్ట్మెంట్‌తో కూడా అగ్రిమెంట్ చేసుకుందన్నారు. అయితే కాంట్రాక్టర్ బొమ్మనేని రామాంజనేయ చౌదరి కావాలనే పనులు చేయకుండా ఉరవకొండ పట్టణ ప్రజలను తాగునీటి ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసి లైసెన్స్‌ను రద్దు చేయాలని కోరారు.

ఐటిపార్క్ అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం..

విశాలాంధ్ర-రాయదుర్గం: ఐటి పార్క్ టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని, సాఫ్టువేర్ ఉద్యోగస్తులు భారీగా టీడీపీలో చేరుతున్నారని రాయదుర్గం స్టీల్ ప్లాంట్ సాధన కమిటీ అధ్యక్షుడు బి.ఎం.నాదల్ పేర్కొ న్నారు. శనివారం గుమ్మగట్ట మండలంలో భారీ రోడ్ షో నిర్వహించిన శ్రీనివాసులు, బిఏం నాదల్‌లు మీడియాతో మాట్లాడుతూ ఆంధ్ర నవ నిర్మాణ రాజధాని అమరావతి నిర్మాణానికి మెట్రో, ఐటీ సాఫ్ట్వేర్ ఉద్యోగాలు కల్పనకు చంద్రబాబునాయుడు కట్టుబడి ఉన్నారన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పన లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు, మోడీ, చంద్రబాబువి జనరితో ఆకర్షితులై సాఫ్టువేర్ కంపెనీలా యజమానులు, సాఫ్టువేర్ ఉద్యోగులు, డాక్టర్లు, యువత, మహిళలు భారీగా మహాకూటమిలో చేరుతున్నారన్నారు. కేంద్రంలో మరోసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీని రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడిని చూడాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను గడపగడపకు తీసుకెళ్లి ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలన్నారు. కాలువ శ్రీనివాసులు విజయం ఖాయమన్నారు. గుమ్మగట్ట రోడ్ షో మండల కన్వీనర్లు, బీఎల్ఓ పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డీబార్

విశాలాంధ్ర-జెఎన్‌టీయూఏ : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం డిగ్రీ రెండు, అరుసెమిస్టర్ పరీక్షలలో అనంతపురం ఎస్ఎల్ఎన్ డిగ్రీ కళాశాలలో ఒకరు, ఎస్వి డిగ్రీ కళాశాలలో ఒకరని బుక్ చేసినట్లు శనివారం పరీక్షల విభాగపు సంచాలకులు ఆచార్య జివి రమణ తెలిపారు. ఎస్ఎల్ఎన్ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థిని కాలుపై రాసుకు రావడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఇకపై ఇటువంటి సంఘటనలు పునరావృతం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంచాలకులు పేర్కొన్నారు.

14 మంది వాలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా

విశాలాంధ్ర-కణేకల్లు: మండల పరిధిలోని మాల్యం గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న 14 మంది వాలంటీర్లు జగనన్నను మళ్ళీ ముఖ్యమంత్రి చేయటం కొరకు మేమందరం సిద్ధం అంటూ స్వచ్ఛందంగా సర్పంచ్ జి. నరసమ్మ, బ్రహ్మానంద వైసీపీ సీనియర్ నాయకులు జి తిప్పారెడ్డి, ఇమామ్ వలి, వైసీపీ ఎస్సీ సెల్ యువ నాయకుడు విజయ్ కుమార్ వారి ఆధ్వర్యంలో ఎంపీడీవో గూడెన్న వాలంటీర్ యొక్క రాజీనామా పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలోవైసిపి నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 5, మే 2024

హస్తం మీ నేస్తం అయితే అభయహస్తం మీ వెంటే ..

కాంగ్రెస్‌కు మద్దతు పలుకుతున్న వామపక్షాలు

విశాలాంధ్ర-రొద్దం : మండలంలోని బొక్సాంపల్లి గ్రామం నుంచి శనివారం కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. పెనుకొండ అసెంబ్లీ అభ్యర్థి నరసింహులు, స్థానిక నాయకులు గడపగడపకు వెళ్తూ ప్రచార నిర్వహణ్యాన్ని చేప ట్టారు. ముఖ్యఅతిథిగా పీసీసీ ఉపాధ్యక్షుడు కేటి శ్రీధర్ పాల్గొని కాంగ్రెస్ పార్టీ అభయ హస్తం ప్రజల నేస్తం అంటూ కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు వివరిస్తూ కొనసాగించారు. తురకలపట్నం, మండల కేంద్రంలో విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో రైతు రుణమాఫీ 2 లక్షల వరకు ఉంటుందని, ప్రత్యేక హెూదా 10 సంవత్సరాలు గ్యారెంటీ, ఇల్లు లేని వారికి 5 లక్షలతో ఇల్లు, ఉచిత విద్య వృద్ధులకు 4 వేలు, వికలాంగులకు రూ.6 వేల పెన్షన్లు ఇస్తామని, ఉపాధి హామీ కూలీలకు రోజుకు 400 కనీస వేతనం ఇస్తామని, రైతు పెట్టుబడి మీద 50 శాతం లాభంతో మద్దతు ధర కల్పిస్తామని, మొదటి సంవత్సరం కేంద్రం ద్వారా 30 లక్షలు రాష్ట్ర ద్వారా 2.25 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, ప్రతి పేద కుటుంబంలో మహిళకు నెలకు 8333 రూపాయలతో ఒక లక్ష రూపాయల ప్రతి సంవత్సరం మహిళా మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు అందిస్తామని, కావున కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరుతూ గడపగడపకు వెళ్లి తమ ఎన్నికల హామీలు గురించి ప్రజలకు వివరించారు. ప్రతి హామీ కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిలబెట్టుకుంటుందని తెలిపారు. అలాగే హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి సమద్ షాహిన్‌కి, అసెంబ్లీ అభ్యర్థి నరసింహులుకు రెండు ఓట్లు వేసి వేయించి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ నాయకులు మండల కన్వీనర్ ప్రకాష్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, రాజగోపాల్ నాయుడు, మాజీ కన్వీనర్ గోవిందప్ప, గంగాధర్, మాజీ సర్పంచ్ ఉగ్ర నరసింహప్ప, మున్న, మాజీ సర్పంచులు ఎంపీటీసీలు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మడకశిరలో కాంగ్రెస్ గెలుపు చారిత్రాత్మక అవసరం

- పదేళ్ల వైసీపీ, టీడీపీ హయాంలో అభివృద్ధి పడకేసింది..
- సుధాకర్‌ను గెలిపిస్తే నియోజకవర్గానికి పూర్వ వైభవం తెస్తాం..
- సీడబ్ల్యూసీ సభ్యుడు డాక్టర్.రఘువీరారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి

విశాలాంధ్ర-అగళి : మడకశిర ప్రాంత అభివృద్ధికి.. కాంగ్రెస్ పార్టీ గెలుపు చారిత్రాత్మక అవసరమని సీడబ్ల్యూసీ సభ్యులు అన్నారు. మడకశిర కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం రాష్ట్రం మొత్తం చూస్తోందని పేర్కొన్నారు. శనివారం మండలంలోని నరసింభూది గ్రామంలోని రంగనాథ స్వామి దేవాలయంలో బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త వారం రోజుల పాటు అనవసరంగా తిరగకుండా సర్వశక్తులు ఒడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుధాకర్ గెలుపునకు కృషి చేయా లన్నారు. గత పది సంవత్సరాల కాలంలో మడకశిర అభివృద్ధికి నోచుకోకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ పాలనలో అర్ధాంతంగా ఆగిపోయిన అభివృద్ధి జరగాలంటే ఈ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ రాజకీయాలకు అతీతంగా హస్తం మన నేస్తంగా భావించి కె.సుధాకర్ హస్తం గుర్తుకు మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించారన్నారు. మడకశిర నియోజక వర్గ అభివృద్ధికి గతంలో కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేసిందని వైసీపీ, టీడీపీ మడకశిర అభివృద్ధిని విస్మరించాయని, సుధాకర్‌ను గెలిపిస్తే రాష్ట్రంలోనూ కేంద్రంలోను ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా వచ్చే 50 ఏళ్లకు సరిపడేలా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రాష్ట్రానికి ప్రత్యేక హెూదా రైతులకు 2 లక్షల రూపాయల రుణమాఫీ చేయడం జరుగుతుందని, ప్రతి పేద ఇంటి మహిళలకు నెలకు రూ.8,333లు చొప్పున నేరుగా మహిళా బ్యాంక్ ఖాతాలోకి జమ చేయడం జరుగుతుందన్నారు.

ప్రతి గ్రామంలోనూ ప్రతిఒక్కరూ మడకశిర కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కే.సుధాకర్‌కు హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి షాహిని హస్తం గుర్తుకు ఓటు వేసి వారిని ఆశీర్వదించాలని కోరారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను కాంగ్రెస్ పార్టీ పై చైతన్య పరచాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి రామక్రిష్ణ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధాకర్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ లు ప్రభాకర్ రెడ్డి, నరసింహమూర్తి, మండల కన్వీనర్ లోకేష్, జిల్లా ఉపాధ్యక్షులు రాజప్ప, సీనియర్ నాయకులు కాంట్రాక్టర్ రంగనాథప్ప, రామిరెడ్డి, మీసాల చౌడప్ప, డి బ్లాక్ అధ్యక్షుడు త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు ప్రతి ఒక్కరి కృషి అవసరం

విశాలాంధ్ర-రొళ్ల : మడకశిర ప్రాంత అభివృద్ధికి,కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిడబ్ల్యూసి సభ్యుడు డాక్టర్. నీల కంఠాపురం రఘువీరారెడ్డి పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక లక్ష్మి ప్యాలెస్‌లో శనివారం బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పది సంవత్సరాల కాలంలో మడకశిర అభివృద్ధికి నోచుకోకపోవడం దారుణం అన్నారు. కాంగ్రెస్ పాలనలో అర్ధాంతంగా ఆగిపోయిన అభివృద్ధి జరగాలంటే ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా హస్తం మన నేస్తంగా భావించి మడకశిర కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కె.సుధాకర్‌కి మీ అమూల్యమైన ఓటు వేసి.. వేయించి గెలిపించాలన్నారు. సుధాకర్‌ను గెలిపిస్తే రాష్ట్రంలోనూ కేంద్రంలోను ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా వచ్చే 50 ఏళ్లకు సరిపడేలా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాన్నారు. కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రాష్ట్రానికి ప్రత్యేక హెూదా రైతులకు 2 లక్షల రూపాయల రుణమాఫీ, ప్రతి పేద మహిళకు నెలకు రూ.8,333 చొప్పున నేరుగా బ్యాంక్ ఖాతాలోకి జమ చేస్తామన్నారు. మడకశిర కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కే.సుధాకర్‌కి హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి షాహిని హస్తం గుర్తుకు ఓటు వేసి వారిని ఆశీర్వదించాలని కోరారు.

నేడు కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా ధర్మవరానికి రాక

విశాలాంధ్ర-ధర్మవరం: కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా, తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆదివారం ఉదయం 10 గంటలకు రానున్నారని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శనివారం మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్న తరుణంలో కేంద్ర హెూం శాఖ మంత్రి అమితుషా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ రాక నాకెంతో సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. వీరి ఆశీస్సులతో ధర్మవరం నియోజకవర్గంలో తప్పక విజయం సాధించాలన్న నమ్మకం ఏర్పడిందని తెలిపారు. బత్తలపల్లి రోడ్డులోని సిఎన్బి కళ్యాణ మండపం వెనుక భాగాన ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సమావేశం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని తెలిపారు. నియోజకవర్గంలోని బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, పెద్దఎత్తున తరలివచ్చి, ఈ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

మద్యం అక్రమ క్రయ, విక్రయాలను అరికట్టండి..

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలో ఎక్కడ కూడా అక్రమ మద్యం నాటు సారా క్రయ విక్రయాలు, నిల్వ ఉంచడం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అనంతపురానికి చెందిన సెబ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని ధర్మవరం సెబ్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్లో కేసుల పురోగతి, రికార్డులు, ప్రాపర్టీని తనిఖీ చేసి సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. సెబ్ సీఐ గురు ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత బాస్కెట్ బాల్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం..

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉచిత బాస్కెట్ బాల్ వేసవి శిక్షణ శిబిరాలు శనివారం ప్రారంభమ య్యాయి. ఈ శిబిరాన్ని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి, ఆల్మీయ ట్రస్ట్ చైర్మన్ సెట్టిపిజయ చంద్రారెడ్డిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదాయత్తుల్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, ఈ ఉచిత శిబిరం సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో మంచి క్రీడాకారులుగా ఎదగాలని తెలియజేశారు. ఈ శిబిరం ఉదయం 6 నుంచి 8 వరకు అలాగే సాయంత్రం 4.30 నుండి 6.30 వరకు రెండు పూటలా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కోచ్ సంజయ్, సీనియర్ క్రీడాకారులు, శిబిరమునకు హాజరైన బాస్కెట్ బాల, బాలికలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు పేదలకు వరం

విశాలాంధ్ర-పుట్టపర్తి: ప్రజా సంక్షేమమే టీడీపీ మేనిఫెస్టో అని పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రాంతంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పల్లె సింధూర మాట్లాడుతూ, రాష్ట్రంలో అరాచక పాలనకు స్వస్తి పలికేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే ఏపీ అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ప్రజల భవిష్యత్తు కోసం చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు .పుట్టపర్తి నియోజకవర్గంలో వైసీపీ పాలనలో ప్రజలకు జరిగిన అభివృద్ధి శూన్యం అన్నారు. వైసీపీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ప్రజలకు సరఫరా కావాల్సిన తాగునీటినీ కూడా సొంత తోటకు మళ్లించి ప్రజలను ఎండబెట్టాడని ధ్వజమెత్తారు. సుపరిపాలన కావాలంటే టీడీపీ సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనకు, హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి పార్థసారథిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.

అవినీతి పాలనకు అంతం పలుకుదాం..

విశాలాంధ్ర-కదిరి : అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలన్నా టీడీపీ అధికారంలోకి రావాలని ఎన్‌డీఏ కూటమి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం పట్నం పంచాయితీ రాచువారిపల్లి తండా, వీరేపల్లి పేట, ఏటిగడ్డ తండా, మంచిరెడ్డిపల్లిలో సూపర్‌సిక్స్ పథకాలపై మండు టెండలను లెక్కచేయకుండా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైకాపా నాయకులు తియ్యటి మాటలుచెప్పి ఆ తర్వాత మోసాలతో వంచించడం పనిగా పెట్టుకొన్నారని అన్నారు. ఈ ఎన్నికలు కేవలం ఎంపీ, ఎమ్మెల్యే లను ఎన్నుకోవడం మాత్రమే కాదని పిల్లలు భవిష్యత్, రాష్ట్ర భవిష్యత్ కోసం మరో మారు చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేసుకోవడానికి పనిచేయాలని పిలుపునిచ్చారు. 2024లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడం తథ్యమన్నారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించండి

- రిటర్నింగ్ ఆఫీసర్ వెంకట శివరామిరెడ్డి

విశాలాంధ్ర-ధర్మవరం : ఎన్నికల విధులు సజావుగా నిర్వహించేలా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని రిటర్నింగ్ ఆఫీసర్ వెంకట శివరామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ధర్మవరం నియోజకవర్గంలో ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ప్రొసీడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రొసీడింగ్ ఆఫీసర్లకు ఎన్నికల విధివిధానాలలో చేపట్టాల్సిన పద్ధతులపై శిక్షణా తరగతులను పట్టణంలోని శ్రీ సాయిబాబా కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ నియోజకవర్గ ఎన్నికలకు గాను స్థానిక నియోజకవర్గంలోని అధికారులు, ఇతర నియోజక వర్గంలోని అధికారులు కూడా శిక్షణలో పాల్గొన్నారు. అనంతరం రిటర్నింగ్ ఆఫీసర్ వెంకట శివరామిరెడ్డి మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులు మే 4వ తేదీ, ఆరవ తేదీలలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా పలు విషయాలను పిఓ, ఏపిఓ లకు తెలియజేశా రు. ఎన్నికల విధులలో అధికా రులు అప్రమత్తంతోపాటు జాగ్రత్తగా ఉండా లని, ఎటువంటి పొరపాట్లకు తావు ఇవ్వరాదని, సజావుగా విజయవంతంగా ఎన్నికలు నిర్వహించేలా తమ విధు లను బాధ్యతతో చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో భాగంగా ఓటరు తన ఓటును వేసుకునేం దుకు, ఏదైనా అనుమానాలు వస్తే ఆ అనుమానా లను కూడా నివృత్తి చేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఓటర్ కార్డు కలిగివున్న ప్రతి ఓటరు తప్పక ఓటును సద్వినియోగం చేసుకునేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. తదుపరి పిఓ లకు, ఏపీఓలకు వచ్చిన అనుమానాలను వెంకట శివరామిరెడ్డి స్వయంగా నివృత్తి చేశారు. అదేవిధంగా పట్టణంలోని సాయి కృప జూనియర్ కాలేజీలో ఎన్నికల విధులలో ఉన్నవారు పోస్టల్ బ్యాలెట్లు సద్వినియోగం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేశామని, పోస్టల్ బ్యాలెట్ ల ప్రక్రియ కూడా ప్రారంభమైంది అని తెలిపా రు. ఈ పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ఈనెల 4వ తేదీతో పాటు ఆరవ తేదీ కూడా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామ్కుమార్, తాసిల్దార్ రమేష్, సహాయ ఎన్నికల ఉప తహసీల్దార్ షణ్ముఖ యాదవ్, పిఓలు ఏపీవోలు 342 మంది పాల్గొన్నారు.

జోరుగా పెనుకొండ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రచారం...

గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

విశాలాంధ్ర-రొద్దం: సత్యసాయి జిల్లా మండల పరిధి శనివారం కాంగ్రెస్ పార్టీ పెనుగొండ ఎమ్మెల్యే అభ్యర్థి బోయ నర్సింహులు, పీసీసీ ఉపాధ్యక్షులు కేటీ శ్రీధర్, బి బ్లాక్ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, మండల కన్వీనర్ ప్రకాష్ రెడ్డి, సోమందేపల్లి కన్వీర్ గంగాధర్, సీనియర్ నాయకులు పెదకోడపల్లి గోవిందప్ప, గోరంట్ల దస్తగిరి శనివారం తురుకుల పట్నం పెద్ద కోడిపల్లి తదితర గ్రామాల్లో ఇంటింటా ప్రచారం కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓట్లువేసి అత్యధికం మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించా అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్ రాకతో సీపీఐ కార్యదర్శి కనిసెట్టిపల్లి వినోద్‌కుమార్ అక్రమ అరెస్ట్

విశాలాంధ్ర-హిందూపురం : హిందూపురం పట్టణానికి సీఎం జగన్ రావడంతో, హిందూపురం సీపీఐ కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్ కుమార్ ను శనివారం అక్రమంగి అరెస్ట్ చేశారు. వారు మాట్లాడుతూ, ఐదు సంవత్సరాల కిందట ప్రతిపక్ష నాయకుడుగా హిందూపురానికి 5 సంవత్సరాల తర్వాత వస్తున్న ముఖ్యమంత్రి హిందూపురం అభివృద్ధికి నియోజకవర్గానికి ఎన్ని కోట్లు డబ్బులు ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఐదేళ్లలో హిందూపురం జిల్లా కేంద్రం కోల్పోవడం, మెడికల్ కాలేజ్ తరలిపోవడం వంటి సమస్యలతో హిందూపురం నియోజకవర్గాన్ని పట్టిపీడిస్తున్నాయని, ఈ సమస్యలు ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. ఉదయం 9 గంటలకే అక్రమ అరెస్ట్ చేసి హిందూపురం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించడం జరిగిందన్నారు. అరెస్ట్‌ను పలువురు ప్రజా సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు.

కాంగ్రెస్‌ను గెలిపిస్తే రూ.2 లక్షల రైతు రుణమాఫీ

ధర్మవరం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రంగన అశ్వర్థ నారాయణ

ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

విశాలాంధ్ర-ముదిగుబ్బ : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి తీరుతామని కాంగ్రెస్ పార్టీ ధర్మవరం అసెంబ్లీ అభ్యర్థి రంగన అస్వర్థ నారాయణ స్పష్టం చేశారు, కాంగ్రెస్ సీపీఐ, సీపీఎంతో కూడిన ఇండియా కూటమి అభ్యర్థి అశ్వర్థ నారాయణ శనివారం మండల కేంద్రంలో విస్తృత ప్రచారం నిర్వహించారు, రంగన అస్వర్థ నారాయణ ఆయా పార్టీల నాయకులతో కలసి ముదిగుబ్బలో ప్రధాన వీధిలో విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రుణమాఫీ తో పాటు వికలాంగులకు 6000 వృద్దులకు 4000 పెన్షన్ సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా మహిళలకు సముచిత స్థానం కల్పించి వారు ఆర్థికంగా బలోపేత మయ్యే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం ధర్మవరం నియోజకవర్గ నాయకులు మధు, జంగాలపల్లి పెద్దన్నతో పాటు సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ఆ పార్టీ సీనియర్ నాయకులు కృష్ణయ్య,. రైతు సంఘం నాయకులు అమర్నాథ్ చౌదరి, తుమ్మల చిన్నప్ప, శంకర, రాధాకృష్ణ, చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు,

14 ఏళ్ల పాలనలో పేదవాడి వైపు కన్నెత్తి చూడని చంద్రబాబు

బి.ఎస్ మక్బూల్ విమర్శలు

విశాలాంధ్ర-కదిరి : 14 ఏళ్ల తన పాలనలో నిరుపేదల వైపు కన్నెత్తి చూడని చంద్రబాబు నేడు వారికి అన్నీ ఉచితాలు ఇస్తానంటూ తప్పుడు హామీలు ఇస్తున్నాడని ఎన్నికల ప్రచారంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బి.ఎస్ మక్బూల్ విమర్శించారు. శనివారం గాండ్లపెంట మండలం మద్దివారిగొంది. వేపరాల, సామాలగొంది, కురుమామిడి సోమయాజులపల్లి, మల్లమీద పల్లి పంచాయతీల్లో ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం ఉన్నన్నాళ్ళు పెత్తందారులకు దోచిపెట్టడం తప్ప పేదవారిని పట్టించుకున్న పాపాన పోని చంద్రబాబు నేడు రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేయాలని చూస్తున్నాడని తెలిపారు. నా పాలన నచ్చితేనే నాకు ఓటు వేయండి అని చెప్పే సీఎం జగనన్న మాదిరి చంద్రబాబు తన పాలనను చూపించి ఓటు అడిగే దమ్ముందా అన్నారు అధికారంలోకి వస్తే ప్రజలకు మేలు చేస్తామని చెప్పడం పోయి ప్రత్యర్థులను అంతం చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్న కూటమి సభ్యులకు ప్రజా కోర్టులో శిక్ష తప్పదన్నారు.

గడచిన ఐదేళ్లలో వాలంటీర్ల వ్యవస్థతో పాటు మా ప్రభుత్వం ఇస్తున్న పథకాలన్నింటినీ వ్యతిరేకించిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఇప్పుడు వాటినే అమలు చేయడంతో పాటు వాలంటీర్ల వేతనాలు పెంచుతామని తప్పుడు మాటలు మాట్లాడుతున్నారన్నారు. కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్రభాస్కర్ రెడ్డి, మాజీ టెంపుల్ చైర్మన్ గోపాలకృష్ణ, మండల ఎన్నికల ఇంచార్జ్ శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ తాతం జగన్, జెడ్పీటీసీ భాస్కర్ రెడ్డి, కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, జెసిఎస్ కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ పార్టీలోకి చేరికలు....

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని 37వ వార్డుకు చెందిన పది కుటుంబాలు టీడీపీ నుండి వైసీపీ పార్టీలోకి చేరాయి. ఈ సందర్భంగా ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తన కార్యాలయంలో అందరికీ పార్టీ కండువా కప్పి ఘనంగా ఆహ్వానించారు. అనంతరం కేతిరెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేయాలని, ఈనెల 13న జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ పార్టీకి అత్యధిక మెజారిటీతో ఓట్లు వచ్చే విధంగా తమ సహాయ సహకారాలను అందించాలని కోరారు. ఐదు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ, చేనేత నువ్వు నమ్ముకున్న కార్మికులు అందరికీ న్యాయం చేయడం జరిగిందని, నవరత్నాల పేరిటన అర్హులైన అందరికీ లబ్ధిని చేకూర్చడం జరిగిందని తెలిపారు. మరోసారి జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుంటే ధర్మవరం నియోజకవర్గం మరింత అభివృద్ధి బాటలో నడుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 37వ వార్డు కౌన్సిలర్, నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీ పార్టీల్లో చేరిక ..

విశాలాంధ్ర- ధర్మవరం: రూరల్ పరిధి లో ధర్మపురి నగలు గ్రామాలకు చెందిన 65 వైసీపీ పార్టీ కుటుంబాల వారు స్థానిక గ్రామ మండల టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ధర్మవరం నియోజకవర్గ ఇంచార్జి పరిటాల శ్రీరామ్ సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీ పార్టీలోకి చేరారు. పరిటాల శ్రీరామ్ పార్టీ కండువా కప్పి ఘనంగా స్వాగతించారు. అనంతరం మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ, ఈనెల జరగబోయే ఎన్నికల్లో నిరంజన్ కుమార్ యాదవ్ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా పట్టణం లోని 37 వ వార్డు కొత్తపేట టీచర్స్ కాలనీ మాజీ వైస్ చైర్మన్ నారా యణరెడ్డి అనుచరులు వైసీపీ నుండి బీజేపీ పార్టీలోకి గద్దం రాజగోపాల్ ఆధ్వర్యంలో 25 కుటుంబాలు చేరాయి. బీజేపీలో చేరిన వారిలో మల్లికా ర్జున, రాజు, మంజునాథ్, సుధాకర్, నారాయణస్వామి, నారాయణ, శశి కుమార్, రంగా, ఖలీల్‌ఉన్నారు.

మహిళా ఓటర్లే అధికం...

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్యలో మహిళల సంఖ్య అధికంగా ఉంది. మొత్తం ఓటర్ల సంఖ్య 2,45,758 కాగా, వీరిలో పురుషుల సంఖ్య 1,21,764 మంది, మహిళల సంఖ్య 1,23,974 మంది, ఇతరులు 20 మంది కలరు. నియోజకవర్గంలో పోలింగ్ బూతులు 287 కలవు. ఈనెల 13న జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో మహిళలే కీలక పాత్ర వహించనున్నారు. అటు ఎన్ డి ఏ అభ్యర్థి సత్య కుమార్ యాదవ్, వైఎస్ఆర్సిపి పార్టీ అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంగనాథ నారాయణ పోటాపోటీగా తమ ప్రచారాలను కొనసాగిస్తున్నారు. ఈ ప్రచారాలు ఈనెల 11న సాయంత్రం ఐదు గంటలకు ముగియనున్నాయి.

నియోజకవర్గ అభివృద్ధే నా లక్ష్యం

బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్

విశాలాంధ్ర-ధర్మవరం : ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధి నా ప్రధమ లక్ష్యమని టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని 30 వ 40వ వార్డులైన తారకరామాపురం గుట్ట కింద పల్లి తదితర వార్డుల్లో తమదైన శైలిలో ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా వైసీపీ పార్టీ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని, అభివృద్ధి అనేది లేదని తెలిపారు. ప్రజలు కూడా సత్య కుమార్ యాదవ్‌కు బ్రహ్మరథం పట్టారు. నియోజకవర్గంలో ముఖ్యంగా చేనేతను నమ్ముకున్న చేనేత కార్మికులకు తగిన న్యాయం చేస్తానని తెలిపారు. నిరుద్యోగ ఉపాధి విషయంలో కూడా తాను కట్టుబడి ఉంటారని తెలిపారు.

బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన: ఆదివారం జరగబోయే బహిరంగ సభ వేదిక ఏర్పాటు ను సత్య కుమార్‌యాదవ్‌తో పాటు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్, హిందూపూర్ పార్లమెంట్ అభ్యర్థి బి కే. పార్థసారథి, ఎమ్మెల్సీ నారాయణరెడ్డి, కోవెలమూడి రవీంద్ర, సత్యసాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అంజనప్ప, బిజెపి అధ్యక్షులు శేఖర్, డోల రాజారెడ్డి తదితర నాయకులు ఏర్పాట్ల స్థలాన్ని పరిశీలించారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్..

విశాలాంధ్ర-కొత్తచెరువు: గోరంట్ల మండలంలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం బి. ఆదినారాయణ ఎన్నికల విధులు ఉల్లంఘించినందుకు ఆయనను సస్పెండ్ చేసినట్టు డీఈఓ మీనాక్షి తెలిపారు. ఎలక్షన్ ట్రైనింగ్ క్లాసుకు హాజరు కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు గోరంట్ల హెచ్ఎం, మండల విద్యాశాఖ అధికారి ఇచ్చిన నివేదిక మేరకు ఆయనను విధుల నుండి సస్పెండ్ చేసినట్టు ఆమె తెలిపారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, ఆదివారం 5, మే 2024

ఉద్యోగ, కార్మికుల పక్షపాతి జగన్‌ను మరోసారి గెలిపించుకుందాం

వైసీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.విరమణ

విశాలాంధ్ర-ఉరవకొండ : ఉద్యోగ, కార్మిక పక్షపాతి జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైసీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.విరమణ, ఉరవకొండ మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, ఆ పార్టీ నాయకులు చెంగలి మహేష్ పేర్కొన్నారు, శనివారం స్థానిక వైసీపీ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, కార్మికులకు గత ఐదు సంవత్సరాలలో చేసిన అభివృద్ధి గురించి వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు విధానాలలో భాగంగా రాష్ట్రంలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానాలను తీసుకొచ్చి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్యోగాలకు గ్యారెంటీ లేకుండా చేశాడని తెలిపారు. 2014 నుంచి 19 వరకు ఐదు సంవత్సరాల బాబు పరిపాలనలో కేవలం 34 వేల మాత్రమే ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానని వారిని నిలువునా మోసం చేసిన ఘనుడు చంద్రబాబు అని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే అంగనవాడీ వర్కర్లకు 7500 రూపాయలుగా ఉన్న జీతాన్ని 11,500కు పెంచారని ఆయాలకు బాబు 3 వేలు ఇస్తే జగన్ 5500 ఇచ్చారని ఆశ వర్కర్లకు బాబు 4000 ఇస్తే జగన్ 10 వేలు పెంచా లని మున్సిపల్ కార్మి కులకు 16,000 ఇస్తున్న జీతాన్ని ఇరవై ఒక్క వేల రూపాయలకు పెంచారని ప్రభుత్వ ఉద్యోగాలకు 27 శాతం ఫిట్‌మెంట్ కూడా మంజూరు చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం వైసీపీ మ్యానిఫెస్టోలో కూడా నాలుగవ తరగతి ఉద్యోగులకు 25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ, నవరత్నాల సంక్షేమ పథకాలను అన్ని కూడా వర్తింప చేసే విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రణాళికను సిద్ధం చేసుకున్నారని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి అధికా రంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ఒక లక్ష 25 వేలు సచివాలయ రెగ్యులర్ ఉద్యోగులు నియమించడం జరిగిందన్నారు. చంద్రబాబు నాయుడు దిగిపోయినటికి రాష్ట్రంలో అన్ని రకాల ఉద్యోగాలు కలిసి 3.97.128 ఉద్యోగాలు ఉంటే ప్రస్తుతం ప్రభుత్వ, కాంట్రాక్ట్,ఔట్సోర్సింగ్ ఉద్యోగాలతో కలిపి ఐదు సంవత్సరాలలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 6.38,087 ఉద్యోగాలు ఇచ్చి రికార్డును సృష్టించాడని పేర్కొన్నారు.. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ సంస్థ ను ప్రభుత్వ రంగంలో విలీనం చేసి కార్మికుల పక్షాన ప్రభుత్వం అండగా నిలబడిందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారం లోకి వచ్చిన తర్వాత ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశాడని తెలిపారు. 2024 డీఎస్సీ ద్వారా 6100 ఉద్యోగాల నియామ కాలకు నోటిఫికేషన్ కూడా జారీ చేయడం జరిగిం దన్నారు. 35 శాతం ఈపీఎఫ్ ఖాతాలు పెరిగాయని పేర్కొ న్నారు 2023 స్కిల్ రిపోర్టు ప్రకారం జగన్ దేశంలో అత్యధిక ఉద్యోగాలు కల్పిస్తున్న రాష్ట్రాలలో నాలుగవ స్థానంలోనూ అత్యధిక వేతనాలు చెల్లిస్తున్న రాష్ట్రాలలో మొదటి స్థానంలోనూ నిలబడ్డారని పేర్కొన్నారు. బాబు హయాంలో నిరుద్యోగుల రేటు 5.3 శాతం ఉంటే జగన్ హయాంలో 4.1 శాతానికి తగ్గిందని పేర్కొన్నారు.

పరిటాల సునీతమ్మ గెలుపే లక్ష్యం...

సునీతమ్మ కుటుంబ సభ్యుల విస్తృత ప్రచారం

విశాలాంధ్ర- రాప్తాడు: రాప్తాడు నియోజకవర్గంలో మాజీ మంత్రి పరిటాల సునీత గెలుపే లక్ష్యంగా పరిటాల కుటుంబ సభ్యులు పరిటాల సునీత సోదరి గుంటూరు లక్ష్మి, పరిటాల శైలజ, బైటీని చైతన్య, పరిటాల రాజేశ్వరి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి పంచాయతీ పరిధిలోని ప్రభాకర్ చౌదరి కాలనీ, సిపిఎం కాలనీల్లో వారు ప్రచారం నిర్వహించగా.. ప్రజల నుంచి అనూహ్య స్పందన కనిపించింది. ఇంటింటికి మ్యానిఫెస్టో గురించి లి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. ప్రతి ?ఒక్కరి నోట.. సునీతమ్మ ను గెలిపించుకోవాలని వినిపిస్తోందన్నారు. పరిటాల సునీత అయితే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారని.. ప్రజలకు మంచి జరుగుతుందనే భావనలో ఉన్నారన్నారు. కచ్చితంగా ఈసారి భారీ మెజార్టీతో సునీతమ్మ గెలవబోతున్నారన్నారు.

టీడీపీ వస్తేనే నిరుపేదల జీవితాల్లో వెలుగులు...

రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్

విశాలాంధ్ర-పామిడి: పామిడి పట్టణంలో టీడీపీ నాయకులతో రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్ సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రం బాగుపడాలన్నా నిరుపేదల జీవితాలలో వెలుగులు రావాలన్న ఉమ్మడి ప్రభుత్వాన్ని అధికారంలోని తేవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఉమ్మడి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోను క్షుణ్ణంగా ప్రజలకు వివరించాలని, ఈ ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపైన ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్ హెచ్ లక్ష్మి నారాయణ రెడ్డి, జింకల రామకృష్ణ, శివకుమార్, మాజీ చైర్మన్ గౌస్ పీరా,మైనారిటీ జిల్లా కార్యదర్శి మహమ్మద్ రఫీ, మాధవ, సూరి, కేశప్ప, గుత్తి మాజీ ఎంపీపీ వీరభద్రయ్య, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల ఇంటింటా విస్తృత ప్రచారం...

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని పాత పోలీస్ స్టేషన్ వీధి, కుంట వీధి ఆర్యవైశ్య వీధిలలో ప్రతి ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్ద రెడ్డిని బంపర్ మెజార్టీతో గెలిపించాలని, మరొక సారి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని యాడికి మండల వైసీపీపీ సీనియర్ నాయకులు బాల రమేష్ బాబు ఆధ్వర్యంలో వైసీపీ నాయకులతో కలిసి ఇంటింటా విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్ర మంలో వైసీపీ యువ నాయకులు బాలచైతన్య, చందన వెంకటరామి రెడ్డి, మహబూబ్ బాషా, భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, చాంద్ భాష నాగ భూషణం, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సూపర్ సిక్స్ పథకాలు

విశాలాంధ్ర-పామిడి : పట్టణ పరిధిలోని 5,6 వార్డ్‌లో మండలంలోని వివిధ గ్రామాల్లో తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పాలనలో పేదలు ఏవిదంగా నష్టపోయారో వివరించారు. అబివృద్ధి చేశామంటూ 20ఏళ్ల రాష్ట్రాన్ని వెనక్కి నెట్టారని ఆరోపించారు. అలాగే రాబోయే ఎన్నికల్లో అందరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి గుమ్మనూరు జయరాం ఎమ్మెల్యేగా ఎంపీగా అంబికా లక్ష్మీనారాయణని గెలిపించాలని అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో ప్రభాకర్ చౌదరి, కరూర్ శివ, ఆచారి, రంగనాయకులు, గంప మల్లయ్య, లీలా మనోహర్, సుంకప్ప,దాసరి నిరంజన్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-ముదిగుబ్బ: ముదిగుబ్బ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రాజేంద్ర గారి ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి అవగాహన శిక్షణ కార్యక్రమం జరిగింది. అదేవిధంగా లెప్రసీ వ్యాధి ఉన్నటువంటి వారికి ఎంసిఆర్ పాదరక్షలు పదిమందికి పంపిణీ చేయడం జరిగింది. ఫ్లోరోసిస్ బాధితులకు ఐదు మందికి లాంబార్ బెల్ట్‌లు ముగ్గురికి నెక్ బెల్టులు పదిమందికి, వాకింగ్ స్టిక్‌లు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేంద్ర మరియు సూపర్వైజర్ స్టాఫ్,ఫీల్డ్ సిబ్బంది లబ్ధిదారులు పాల్గొనడం జరిగింది.

పిల్లల భవిష్యత్తు టీడీపీతోనే..

ఎమ్మెస్ రాజు సతీమణి ఉమాదేవి పిలుపు

విశాలాంధ్ర-అగళి : ఈనెల 13న జరుగునున్న ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ అభ్యర్థి ఎమ్మెస్ రాజు, హిందూపూర్ పార్లమెంట్ అభ్యర్థి బి కే పార్సెల్ కి ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెస్ రాజు సతీమణి ఉమాదేవి పిలుపునిచ్చారు. మండలం లోని అగళి మన మడకశిర ఎమ్మెల్యే సతీమణి ఉమాదేవి శనివారం ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని ప్రచారం చేసారు. తెలుగుదేశం పార్టీ ఓటు వేస్తేనే రాష్ట్ర భవిష్యత్తు పిల్లలు భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను చక్కగా వివరించారు. ఆయా గ్రామాల్లో మహిళా లు ఉమాదేవిని ఘన స్వాగతం పలికారు. ఉమ్మడి అభ్యర్థి ఎం ఎస్ రాజు ఎన్నికలు ప్రచారంలో బిజెపి కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంచార్జ్ ఎస్.చంద్రశేఖర్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి విక్టోరియా రాణి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డ రంగయ్య గౌడ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు రవీంద్ర, మెలవాయి నారాయణప్ప, పెన్నప్ప, జడ్పీటీసీ ఉమేష్, మండల కన్వీనర్ కుమారస్వామి, మాజీ సింగల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శివకుమార్, మాజీ ఎంపీపీ నరసింహప్ప నాయకులు పాల్గొన్నారు.

బీసీలు అంటే అంత చులకనా..?

విశాలాంధ్ర-తలుపుల: మండల కేంద్రంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట ప్రసాద్ ర్యాలీ సందర్భంగా జరిగిన విషయంలో తలుపుల మండలం బీసీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మొదటినుంచి కష్టపడుతూ పార్టీ జెండా మోసిన వారిని గుర్తించకుండా ఒక సామాజిక వర్గం వారిని స్టేజ్ పైకి పిలవడం వారికే ప్రాధాన్యత ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. బీసీలను ఎప్పుడూ ఇదే విధంగా అవమానిస్తున్నారని తక్షణ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి గంగరాజు బీసీ సెల్ జిల్లా కార్యదర్శి, కొమ్మెర శ్రీనివాసులు మండల పార్టీ ప్రధాన కార్యదర్శి, వల్లెపు గంగరాజు క్లస్టర్ వన్ ఇంచార్జి , చిన్న నరసింహులు వాల్మీకి సంఘం కదిరి తాలూకా అధ్యక్షులు, శ్రీనివాసులు లక్కసంద్రం గ్రామం బొత్తు ఇంచార్జ్, రమేష్ భట్రేపల్లి బూత్ ఇంచార్జ్, కొమ్మెర కృష్ణ, యూనిట్ ఇంచార్జ్ ఈశ్వరయ్య, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీని ఆదరించండి ..

విశాలాంధ్ర-పెనుకొండ : మండల పరిధిలోని మావటూరు పంచాయతీ సత్తరుపల్లి గ్రామంలో శనివారం వైసీపీ నాయకులు సుధాకర్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనేక సంక్షేమ కార్యక్రమాలు భవిష్యత్తులో ఇంకా మెరుగుగా జరగాలంటే జగన్మోహన్ రెడ్డిని దీవించాలని ఇక్కడ పోటీ చేస్తున్న ఉషశ్రీని, శాంతమ్మను, దీవిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు.

టీడీపీలో చేరిన 40 కుటుంబాలు

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమం దేపల్లి మండలం మాగే చెరువు పంచాయతీ నుండి, పరిగి మండలం శీగుపల్లి పంచాయతీ నుండి రోద్దం మండలం సాని పల్లి గ్రామం నుంచి 10 కుటుంబాలు మొత్తం 40 కుటుంబాలు శనివారం పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ సమక్షంలో వైసీపీ పార్టీ వీడి తెలుగుదేశం పార్టీలోకి చేరారు. వారందరికీ కండువా కప్పిపార్టీ లోకి ఆహ్వానించారు.

వైసీపీ నాయకులు జోరు ప్రచారం

విశాలాంధ్ర-యాడికి : మండల కేంద్రంలో మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉప సర్పంచ్ కాసా చంద్రమోహన్ ఆధ్వర్యంలో శనివారం రాఘవేంద్ర కాలనీలో జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు, ప్రచారంలో భ భాగంగా ఇంటి ఇంటికి తిరుగుతూ తిరుగుతూ రాబోవు ఎన్నికలలో తాడిపత్రి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి, అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి మాల గుండ్ల శంకర్ నారాయణ ఫ్యాన్ గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు కోరారు. అనంతరం పలు కాలనీలలో తిరుగుతూ కాలనీవాసుల సమస్యలు తెలుసుకొంటు వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కాసా చంద్రమోహన్, ఎంపీటీసీ సభ్యులు బొంబాయి వెంకట్ నాయుడు,అవుకు నాగరాజు, గొడ్డుమర్రి రామమోహన్, పామిశెట్టి నాగరాజు, వార్డ్ సభ్యులు గుంత తిరుపతి, మేకల రామచంద్ర, గజ్జి బాలపెద్దయ్య,పరమేశ్వర రెడ్డి, దాసరి శ్రీధర్, మిద్దె నరేంద్ర, వైసీపీ నాయకులు,ఎస్సీ సెల్ కన్వీనర్ పందు శ్రీరాములు, ఉప్పలపాడు బాలగంగయ్య,పొంతల కిట్టయ్య, చిట్టెం రెడ్డి బాలరెడ్డి, మబ్బు సుదర్శన్‌రెడ్డి, కంభగిరి, పోలూరు శివ, రాముడు, దేవేంద్ర, మధు, చిన్నోడు, పశువుల దొడ్డినరసింహులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి పల్లకి ఉత్సవం

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ మండలం పెన్నాహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీవారి పల్లకి ఉత్సవం కార్యక్రమం శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభయమానంగా తీర్చిదిద్దిన పల్లకిలో కొలవ దీర్చి ఆలయము చుట్టూ ప్రదక్షణ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో విజయ్ కుమార్, అర్చకులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ ఐసెట్‌కు 48,828 దరఖాస్తులు

సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య హుస్సేన్‌రెడ్డి

విశాలాంధ్ర-జెఎన్‌టియుఏ : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం చేపడుతున్న ఏపీ ఐ సెట్ 2024 పరీక్షకు 48,828 దరఖాస్తులు వచ్చాయని ఉపకులపతి ఆచార్య కే హుస్సేన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎస్కేయూలో ఏపీ ఐసెట్ పరీక్షపై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ .. పరీక్ష మొత్తం 49 కేంద్రాల్లో పరీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. పరీక్ష సమయానికి అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.కార్యక్రమంలో కన్వీనర్ ఆచార్య పి.మురళి కృష్ణ, వైస్ కన్వీనర్ ఆచార్య నరసింహన్, మెంబెర్స్ ఆచార్య పి.వెంకట రమణ, ఆచార్య టి.భాస్కర్ రెడ్డి, ఆచార్య డి. ప్రభాకర్, సబ్జెక్టు ఎక్స్‌పర్ట్ ఆచార్య ఏవి రమణ, ఆచార్య ఏ.మల్లికార్జున రెడ్డి (ఫార్మర్ రెక్టర్), యూనివర్సిటీ పిఆర్ఓ ఆచార్య కే.రామగోపాల్ పాల్గొన్నారు.

నేడు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ధర్మవరానికి రాక

విశాలాంధ్ర-ధర్మవరం : కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఆదివారం ఉదయం 10 గంటలకు రానున్నారని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శనివారం మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్న తరుణంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమితుషా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ రాక నాకెంతో సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. వీరి ఆశీస్సులతో ధర్మవరం నియోజకవర్గంలో తప్పక విజయం సాధించాలన్న నమ్మకం ఏర్పడిందని తెలిపారు. బత్తలపల్లి రోడ్డులోని సిఎస్పి కళ్యాణ మండపం వెనుక భాగాన ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సమావేశం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని తెలిపారు. నియోజకవర్గంలోని బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, పెద్దఎత్తున తరలివచ్చి, ఈ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

1,344 టెట్రా మద్యం ప్యాకెట్లు స్వాధీనం

స్వాధీనం చేసుకున్న టెట్రా ప్యాకెట్లతో పోలీసులు ..

విశాలాంధ్ర-ఉరవకొండ : ఉరవకొండ నియోజకవర్గం వి.కొత్తకోట గ్రామ శివారులో శనివారం రూట్ వాచ్ చేస్తుండగా ద్విచక్ర వాహనాలలో అక్రమంగా 1344 టెట్రా మద్యం ప్యాకెట్లను తీసుకొస్తున్న విడపనకల్లుకు చెందిన దూది నాగరాజు, గుణక బాల ఆంజనేయులు, నిమ్మగల్లు ధనంజయ అనే వ్యక్తులను అరెస్టు చేసి రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సబ్ ఇన్స్పెక్టర్లు పి.కిషోర్ కుమార్ ప్రవీణ్‌కుమార్ నాయక్ శనివారం విలేకరులకు తెలిపారు. సెబ్ అడిషనల్ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ అనంతపురం వారి ఆదేశాలు మేరకు రూట్ వాచ్ చేసి దాడులు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో వాసు, శివయ్య పాల్గొన్నారు.

ఐదు కుటుంబాలు టీడీపీని వీడి వైసీపీలోకి చేరిక..

విశాలాంధ్ర-కణేకల్లు : కణేకల్ మండలం బ్రహ్మసముద్రం గ్రామం సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీని వీడి, వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన అంజినేయులు, పెన్న ఓబులేసు, నారాయణ, చిక్కన్న, వన్నూరస్వామి తదితర కుటుంబాలకు రాయదుర్గం నియోజకవర్గం వైయస్ఆర్‌సిపి ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి, పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారందరూ పార్టీ కోసం కష్టపడి పనిచే జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయడానికి కృషిచేయాలని సూచించారు.

అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల్లో అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు ..

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం : కర్నాటక సరిహద్దు గాలిమారెమ్మ టెంపుల్ ఇంటిగ్రేటెడ్ అంతర్రాష్ట్ర చెక్ పోస్టును సోమలాపురం, హులికల్, విడపనకల్లు చెక్ పోస్టులను ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాలతో సెబ్ అదనపు ఎస్పీ జి.రామకృష్ణ అర్ధరాత్రి నుండీ తెల్లవారుజాము వరకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెహికల్ మూవ్మెంట్ రిజిష్టర్‌ను పరిశీలించారు. కర్నాటకకు వెళ్లొచ్చే వాహనాలను కర్నాటక లిక్కర్, డబ్బు, చీరలు, తదితరాలు అక్రమంగా తరలించకుండా నిరంతర తనిఖీలు చేయాలని పోలీసులను ఆదేశించారు.

సీఎం జగన్ రాకతో సీపీఐ కార్యదర్శి కనిసెట్టిపల్లి వినోద్‌కుమార్ అక్రమ అరెస్ట్

విశాలాంధ్ర-హిందూపురం : హిందూపురం పట్టణానికి సీఎం జగన్ రావడంతో, హిందూపురం సీపీఐ కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్‌కుమార్‌ను శనివారం అక్రమంగా అరెస్ట్ చేశారు. వారు మాట్లాడుతూ, ఐదు సంవత్సరాల కిందట ప్రతిపక్ష నాయకుడిగా హిందూపురానికి 5 సంవత్సరాల తర్వాత వస్తున్న ముఖ్యమంత్రి హిందూపురం అభివృద్ధికి నియోజకవర్గానికి ఎన్ని కోట్లు డబ్బులు ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఐదేళ్లలో హిందూపురం జిల్లా కేంద్రం కోల్పోవడం, మెడికల్ కాలేజ్ తరలిపోవడం వంటి సమస్యలతో హిందూపురం నియోజకవర్గాన్ని పట్టిపీడిస్తున్నాయని, ఈ సమస్యలు ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. ఉదయం 9 గంటలకే అక్రమ అరెస్ట్ చేసి హిందూపురం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించడం జరిగిందన్నారు. అరెస్టును పలువురు ప్రజా సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు.